# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | సోమవారం 12 ఆగస్టు 2024

తెలుగు దినపత్రిక




## సీఎంతో స్పీకర్..

ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధుల విన్నపాలను ఆమోదించాలని ఈ సందర్భంగా స్పీకర్ బాబును కోరారు.



## అమరరాజాను ఆపండి..

- స్వార్థం కోసం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దు..
- ఇప్పటికే కేన్స్, కార్నింగ్ ఔట్..
- రాష్ట్ర సర్కార్ వెంటనే మేల్కోవాలి..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హామీలకు కట్టుబడకనే యాజమాన్యాలు
- తరలుతున్నాయని ఆగ్రహం..
- తెలంగాణను వీడేలా చేయడంపై విమర్శలు..

2

## ముగింపు అదుర్స్...

### విశ్వక్రీడలు పరిసమాప్తం..


### పారిస్ ఒలింపిక్స్‌కు తెర..

- ఉత్కంఠభరితంగా ఆటలు..
- ఎన్నో గుర్తులు.. మరెన్నో మరకలు..
- గతం కన్నా మెరుగ్గా రాణించిన భారత అథ్లెట్స్..
- తృటిలో జారిన 7 పతకాలు
- ఆరు మెడల్స్ తో ఇంటిదారి..

4



# పనులు పీక్స్.. పబ్లిసిటీ వీక్..!



'తప్పదు మరీ.. ఆఫ్ట్రాల్ సిగరెట్టు పెట్టే నన్ను కాల్చకు.., చస్తావ్... అని ప్రచారం చేసుకున్నప్పుడు నాలాంటి వాడు కూడా నన్ను కెలక్కు.. పోతావ్.. అని చెప్పుకోవడంలో తప్పులేదు సార్..' అని ఓ సినిమాలో డైలాగ్. అవును పబ్లిసిటీ అనేది తప్పదు మరి. ఎప్పుడో ఒకప్పటిలా 'పనిచెయ్.. ఫలితం ఆశించకు..' అనేది ఔట్ డేటెడ్. చేసింది చెప్పుకోవాల్సిందే.., చెప్పకపోవడం ఫెయిల్యూరే. సీఎం పర్యటన తాలూకు వ్యవహారం కూడా అదే విషయాన్ని తెలియజెప్పుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా టూర్ లో ఎన్నో మల్టీ నేషన్ కంపెనీలతో ఊహించని రీతిలో డీల్స్ కుదుర్చుకుంటున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల వరద తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పనుల్లో పీక్స్ గా ఉన్నా, పబ్లిసిటీ మాత్రం వీక్ గా ఉండడంతో పొగడ్తలేమోగానీ, పైకెళ్లి అపవాదు మూటగట్టుకునే పరిస్థితి దాపురించింది.

- జనపదం, బ్యూరో

### సీఎం అమెరికా పర్యటన అద్భుతం..

### పీఆర్‌లో పూర్తి వైఫల్యం..

### ఊహించని ఒప్పందాలు.. లెక్కకు మించి డీల్స్..

- పక్కా ప్లాన్ చేసిన ఉన్నతాధికారి జయేష్
- ప్రచారంలో మాత్రం కాంగ్రెస్ ఫెయిల్యూర్స్..
- మంచేమోగానీ, చెడు ప్రచారమే ఎక్కువైంది..
- బీఆర్ ఎస్ సోషల్ మీడియా ముందు హస్తం బలాదూర్..

2



## మస్త్ ఖుషీ అయింది..

- రంగనాయక్ సాగర్‌కు జల కళ
- సంబురపడిన మాజీ మంత్రి హరీష్ రావు..
- కాలువల్లోకి నీటిని వదలాలని వినతి..
- అన్నదాతల ఆనందమే ప్రధానమని వ్యాఖ్య..

2



ఇద్దరూ.. ఒక్కటే..?!

## వాళ్లు ఫిక్స్..

- రేవంత్, సంజయ్ బాయ్ బాయ్..
- పబ్లిక్‌లో ఢీ.. పర్సనల్‌గా హాయ్..
- తాజాగా కేటీఆర్ పై వ్యాఖ్యలతో మరింత క్లారిటీ..
- ఎంపీ ఎన్నికల వేళా బండికి రేవంత్ సహకారం...?
- తెర వెనుక రాజకీయం..

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో తెర వెనుక సరికొత్త సమీకరణలు చోటుచేసుకుంటున్నాయి. బయట జరిగే పాలిటిక్స్ వేరు లోపట జరుగుతున్న ట్రిక్స్ వేరన్నది స్పష్టం అవుతున్నది. పార్టీలపరంగా కాక వ్యక్తులపరంగా ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకోకపోయినా ఒకరి కోసం మరొకరు తలపోస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చర్చ ఎప్పటి నుంచో ఉన్నా ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మీడియా చిట్ చాట్ ద్వారా బయటపడింది.

**రేవంత్ కు బండి అంటే ఇష్టమటా..**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో బండి సంజయ్ అంటే సీఎం రేవంత్ రెడ్డికి అమితమైన ఇష్టమట. వయసురీత్యా ఇద్దరిదీ ఒకే స్వభావం కావడంతో ఒకరి ఎదుగుదలను మరొకరు కోరుకుంటున్నారట. ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లోను ఇది స్పష్టమైంది. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి బండి సంజయ్ గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి చేయని ......

(తరువాయి 2లో)

## సాగర్‌కు సొగసులు..

అందాలను తిలకించేందుకు భారీగా పర్యాటకులు

పోలీసుల ముందస్తు చర్యలు

నాగార్జున సాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ఎనిమిది గేట్ల ఎత్తివేత

3

నాగార్జున సాగర్ అందాలను ఆరబోస్తోంది. డ్యామ్ నీటి ప్రవాహం కిందకు దూకుతున్న ద్రుశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. వరుస సెలవులు కావడంతో డ్యామ్ ను తిలకించడానికి పర్యాటకులు పోటెత్తుతున్నారు. పోలీసులు పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు చేశారు.





## తెలంగాణ మనదే..?!

- భవిష్యత్తులో అధికారంలోకి తెలుగుదేశం..?
- టీటీడీపీ ముఖ్య నాయకులతో ఏపీ సీఎం చంద్రబాబు
- ప్రతినెలా రెండో శని, ఆదివారం ఇక్కడే..
- పార్టీ నిర్మాణంపై ప్రధాన దృష్టి..
- స్థానిక సమరానికి కేడర్‌కు నూతన శక్తులు..

2

## కూరండిన ప్రవీణ్.. కేసు పెట్టిన పోలీస్..

- వండే విధానం షూట్ చేసి సోషల్ మీడియాలో అప్లోడ్
- యూట్యూబర్ పై జంతుప్రేమికుల ఆగ్రహం..
- ల్యాబ్ కు ప్రవీణ్ కుమార్ వంటకం..
- నెట్టింట నెమలి కూర కలకలం..



**తంగళ్లపల్లికి** చెందిన శ్రీ టీవీ యూ ట్యూబ్ చానెల్ నిర్వాహకుడు ప్రవీణ్ కుమార్ ఇటీవల 'నెమలి కూర సంప్రదాయ పద్ధతిలో ఎలా వండాలి' అంటూ ఛానల్లో ఓ వీడియో పోస్ట్ చేశాడు. అది సోషల్ మీడియాలో తీవ్రంగా వైరలైంది. వీడియోను చూసిన జంతు ప్రేమికులు ప్రవీయ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలంటూ కామెంట్లు పెట్టారు. స్పందించిన ఫారెస్టు అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి వండిన నెమలి కర్రీని స్వాధీనం చేసుకున్నారు. నెమలి జాతీయ పక్షి కావడంతో ప్రవీణ్ కుమార్ పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వ్యూస్ కోసం ప్రవీణ్ కుమార్ నెమలి కూర వంటకం తయారీ పేరుతో యూ ట్యూబ్ లో వీడియోను అప్ లోడ్ చేశాడని ఎఫ్ ఆర్వో కల్పనాదేవి తెలిపారు. అయితే నెమలి కూర వంటకం అంటూ వీడియో చేసి పేరు పెట్టుకోవడం నేరమేనని, అతడు తయారు చేసిన వంటకాన్ని పరీక్షల కోసం ల్యాబ్ కు పంపిస్తామని ఆమె వివరించారు.

- జనపదం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

# అమరరాజాను ఆపండి..

- స్వార్థం కోసం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దు..
- ఇప్పటికే కేన్స్, కార్నింగ్ ఔట్..
- రాష్ట్ర సర్కార్ వెంటనే మేల్కోవాలి..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హామీలకు కట్టుబడకనే యాజమాన్యం పోతోందని ఆగ్రహం..
- తెలంగాణను వీడేలా చేయడంపై విమర్శలు..

**జనపదం, హైదరాబాద్ :** కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైఖరేంటో అర్థంకాక చాలా సంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయని, తెలంగాణ ప్రభుత్వం మాకిచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమర రాజా సంస్థ చెబుతున్నట్లుగా వార్తలు చూస్తున్నమని, అదే నిజమైతే చాలా దురదృష్టకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో చాలా సంస్థలు ఇబ్బందులు పడుతున్నాయని, వారి వైఖరేంటో అర్థంకాక చాలా సంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయని వాపోయారు. కేన్స్ టెక్నాలజీ అనే సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్‌కు వెళ్లిపోయిందని, కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించారని, ఇప్పుడు అమర రాజా కూడా వెళ్లిపోతానని చెబుతున్నదని, తెలంగాణ బ్రాండ్‌కు ఇది తీవ్ర నష్టం చేస్తుందని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు.

**స్వార్థం కోసం తాకట్టు పెట్టొద్దు..**



రాజకీయ ప్రయోజనాలకోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టటం ఎంతమాత్రం మంచిది కాదని కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వ పాలసీలు పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుగుణంగా కొనసాగించాలన్నారు. అమరరాజా సంస్థ తెలంగాణలో రూ.9,500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా వాళ్లను ఒప్పించేందుకు ఎంతో కష్టపడ్డామని గుర్తుచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే కొనసాగిస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు.

**సీఎం వ్యాఖ్యలతో నష్టం..**

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయంతో రెవెన్యూ సర్ ప్లేస్ స్టేట్‌గా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ స్వయంగా ముఖ్యమంత్రే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, దివాళా తీసిందంటూ ఎయిడ్స్, క్యాన్సర్ పేషెంట్ అని ప్రచారం చేస్తుండటం ఆవేదన కలిగిస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేసే ఇలాంటి ప్రకటనలు సీఎం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అమరరాజా సంస్థ ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారికి గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కొనసాగించాలన్నారు. లేదంటే మరిన్ని సంస్థలు రాష్ట్రాన్ని వదిలే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# మస్త్ ఖుషీ అయింది..

- రంగనాయక్ సాగర్ జల కళ
- సంబురపడిన మాజీ మంత్రి హరీష్ రావు..
- కాలువల్లోకి నీటిని వదలాలని వినతి..
- అన్నదాతల ఆనందమే ప్రధానమని వ్యాఖ్య..

**జనపదం, సిద్దిపేట ప్రతినిధి :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రంగనాయక్ సాగర్ జలాశయం గోదావరి జలాలతో నిండుకుంటున్న దృశ్యం చూసి తన మనసు పులకరించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ ప్రాజెక్టుకు గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతుండడంతో ఎత్తిపోతలను ఎమ్మెల్యే హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నీరందించాలనే నిత్య తపనకు ఈ ప్రాజెక్టు నిదర్శనమన్నారు. అన్నదాతల ఆనందం, వారి ముఖాల్లో చిరునవ్వే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. ఈ జలదృశ్యాన్ని చూస్తుంటే మనసు పులకరించిపోతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా నంది మేడారంలోని పంప్‌హౌస్‌కు నీరు చేరుతుండగా, శనివారం మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ కూడా ఒకే మోటర్ నడిపిస్తున్నారు. మొత్తం 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 13 టీఎంసీలకుపైగా జలాలు మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు జలాశయంలో 27.54 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను ప్రస్తుతం 17.06 టీఎంసీల నిలువ ఉన్నట్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి చేరుకుంటున్నాయి. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు.



**కాలువల్లోకి నీటిని విడుదల చేయండి**

రంగనాయక సాగర్ లో ఇటీవల మిడ్ మానేరు ద్వారా నీటి పంపింగ్ జరిగింది. రిజర్వాయర్ లోని నీటిని కాలువలకు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి, నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఇరిగేషన్ అధికారులను కోరారు. సిద్దిపేట ఇరిగేషన్ ఎస్ ఈ బస్వరాజ్, ఈఈ గోపాల కృష్ణ తో ఆదివారం ఉదయం హరీష్ రావు ఫోన్ లో మాట్లాడారు. ప్రస్తుతం రంగనాయక సాగర్ లో 2.3 నీరు ఉందని, మూడు టీఎంసీల పూర్తి సామర్థ్యం నీటిని నింపాలన్నారు. రిజర్వాయర్ల నుంచి కాలువలకు నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అదేవిధంగా కెనాల్స్ లో మట్టి, పిచ్చి గడ్డి, తుంగ పేరుకుపోయిందని, వెంటనే తొలగించాలని చెప్పారు. త్వరితగతిన కాలువల్లోకి నీటిని విడుదల చేసి రైతాంగానికి పంటల సాగుకు నీరందించాలని అధికారులను హరీష్ రావు కోరారు.



## మాజీ ఎమ్మెల్యే నన్నపునేనిపై కేసు..

**జనపదం, వరంగల్:** వరంగల్ ఎంజీఎంలో శిశువును కుక్కలు పీక్కుతిన్న ఘటనను నిరసిస్తూ దవాఖాన ఎదుట ధర్నా చేసిన మాజీ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తోపాటు తొమ్మిది మందిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదైంది. మట్టెవాడ సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. మూడురోజుల క్రితం ఎంజీఎంలో శిశువును కుక్కలు పీక్కుతింటున్న ఘటనను నిరసిస్తూ శనివారం మాజీ ఎమ్మెల్యే నరేందర్ తన కార్యకర్తలతో ఆసుపత్రి గేటు ఎదుట ధర్నా చేశారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా మాజీ ఎమ్మెల్యేతోపాటు 34వ డివిజన్ కార్పొరేటర్ కుమారస్వామి, రవి, కొంగ రాజేందర్, ఎలగంటి సతీశ్, ఎలగంటి మధు, సీతారాం, బజ్జూరి వాసు, తోట స్రవంతి ధర్నా చేయగా.. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ప్రజలు, నాయకులు ఎవరైనా నిరసన, ధర్నాకు చేసుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దంతెవాడలో ఎన్ కౌంటర్

**జనపదం, క్రైమ్:** తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో మరోసారి ఎన్ కౌంటర్ జరిగింది. దంతెవాడ జిల్లాలో మావోయిస్టులకు భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. కాల్పులు జరిగిన ప్రదేశంలో మావోలకు సంబంధించిన సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల నిర్మూలన కోసం భద్రతా బలగాలు అడవులలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు.

## రెండు రోజులు వర్షాలు..

**వెల్లడించిన వాతావరణ శాఖ**

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉపరితల ఆవర్తనం, బలమైన నైరుతి రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్మల్, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉంది. ఈ మేరకు వర్షం కురిసే అవకాశం ఉన్న జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేశారు. ఇక రాజధాని హైదరాబాద్ లో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుందని చెప్పారు. సాయంత్రం తర్వాత జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

# నేడు దేశవ్యాప్తంగా వైద్యసేవలు బంద్..

**జూనియర్ డాక్టర్ హత్యపై రెసిడెంట్ డాక్టర్ల ఆగ్రహం**

**నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్**

**జనపదం, బ్యూరో:** బంగాల్ కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలి దారుణ హత్య, హత్యాచారంపై రెసిడెంట్ డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖను పంపించింది. ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల వైద్యులకు మద్దతుగా ఈ చర్యను చేపట్టినట్లు పేర్కొంది. అయితే, జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫోర్డా కేంద్రాన్ని శనివారం డిమాండ్ చేసింది. ఈ మేరకు 24 గంటల డెడ్‌లైన్ కూడా ఇచ్చింది. చర్యలు తీసుకోకుంటే ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేస్తామని హెచ్చరించింది. దౌర్జన్యాలకు గురైన తమ వారికి న్యాయం జరగాలని పేర్కొంది. ఈ విషయానికి రాజకీయ రంగు పులిమి ప్రతికూల కోణంలో చూడొద్దని అభ్యర్థించింది. అన్ని వర్గాలు వైద్యులకు మద్దతు ఇవ్వాలని కోరింది.



**దారుణ ఘటన**

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలు దారుణ హత్యకు గురయ్యారు. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు కూడా ప్రాథమిక పోస్టుమార్టంలో తేలింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రి సెమినార్ హాలులో అర్ధ నగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమె మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు శవపరీక్షలో తేలింది. శరీరంపై వివిధ చోట్ల గాయాలు కూడా కనిపించాయి. ఆమెపై హత్యాచారం జరిగినట్లు శవ పరీక్ష ప్రాథమిక నివేదిక తేల్చింది. మరోవైపు, ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఇప్పటికే ఓ పౌర వాలంటీర్‌ను అరెస్టు చేశారు. హత్య జరిగిన స్థలంలో దొరికన ఓ బ్లూటూత్ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకు ని హంతకుడిగా నిర్ధరించారు. అయితే ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆస్పత్రిలో ఉద్యోగుల రక్షణపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది.

**నిందితుడికి నాలుగు పెళ్లిళ్లు..**

కోల్‌కతాలోని ఓ ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. హత్య తర్వాత నిందితుడు లైంగిక దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్న పోలీసులు తుది పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడిన నిందితుడికి, ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు అయినట్లు తేలింది. ఇదిలా ఉంటే నిందితుడిని కఠినంగా శిక్షించాలని పెద్దఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# పనులు పీక్స్.. పబ్లిసిటీ వీక్..!

**జనపదం, బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో చేసుకుంటున్న ఒప్పందాలు ఎవరూ ఊహించనవి. అమెరికా పర్యటనను పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి జయేష్ రంజన్ అద్భుతంగా డీల్ చేస్తున్నారు. ముందుగానే ఆయన ఏర్పాట్లు చేసి పెట్టి పక్కా ప్రణాళికతో అన్నీ జరిగేలా చేశారు. కానీ, వాటికి ప్రచారం తెచ్చుకునే విషయంలో, ప్రజలకు సమాచారం చేరే వేసే విషయంలో విఫలమయ్యారు. ఎన్నో అద్భుతాలు సాధించినా వాటిపై అసలు ప్రచారాలు చేసుకోక పోగా, నెగెటివ్ ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది.

**పీఆర్ టీం వైఫల్యమే..**

ముఖ్యమంత్రి పది రోజుల పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీం మల్టీ నేషన్ కంపెనీలతో చాలా వాటిని కవర్ చేసింది. కొత్తగా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడమో, విస్తరించే ప్రణాళికలకో ఒప్పించారు. చాలా డీల్స్ కు ఎంవోయూలు చేసుకున్నారు. రేవంత్ స్థానంలో కేటీఆర్ పర్యటన గనుక ఉండి ఉంటే చేసే హడావుడి మరోలా ఉండేది. ఆ స్పందన కూడా వేరే లెవల్లో వచ్చేది. ఆ పార్టీ శ్రేణులు ప్రతిదానిని ప్రజలకు చేరే వేసేలా, ఇతర పార్టీల వారు సాధించనివి ఎన్నో తాము తెలిగ్గా కేటీఆర్ చేశాడనే రేంజ్ లో పబ్లిసిటీ చేసుకునేవారు. ఇప్పుడు రేవంత్ విషయంలో అలాంటి ప్రచారం జరగకపోవడానికి ప్రధాన కారణం చేస్తున్న వాటిని ప్లాన్డ్ గా చూసుకోవల్సిన పీఆర్ టీం విఫలమనే అభిప్రాయం వినిపిస్తోంది.





**పాసిటివ్ కాస్త నెగటివ్..**

సీఎం రేవంత్ పర్యటనలో కంపెనీలు.., చేసుకున్న ఒప్పందాలు.., సమావేశాల వివరాలతో ఎప్పటికప్పుడు వీడియో లతో సహా అప్ డేట్స్ మీడియాకు అందాల్సి ఉంది. కానీ, ఈ విషయంలో విఫలమయ్యారు. అదీకాకుండా ఆయా కంపెనీల గొప్పతనం, అవి రాష్ట్ర రాజధానికి వస్తే కలిగే లాభాలు ఏంటో వివరించేలా ప్రణాళికలు చేయాల్సి ఉండే. ఆ దిశగా జరిగిన ప్రయత్నాలు చాలా తక్కువే అని చెప్పాలి. దీంతో పాజిటివ్ ప్రచారం జరగకపోగా, ఎదుటి పక్షం ఒకటి, రెండు కంపెనీల పేర్లను చూపించి పూర్తిగా నెగెటివ్ ప్రచారం చేయడం మరింత మైనస్ గా మారింది.

**సోదరుడి పేరుతో అప్రతిష్ట..**

సీఎం రేవంత్ రెడ్డి చేసిన డీల్స్ ఎన్నో గొప్పవే అయినా బీఆర్ఎస్ మాత్రం వాటిని పసలేనివి అన్నట్టుగా ప్రచారం చేయడంలో సక్సెస్ అయ్యాయని చెప్పొచ్చు. స్వచ్ఛ బయోలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు ఓ డైరెక్టర్ అనే కారణంతో చేసిన ప్రచారంతో మొత్తం సీఎం పెట్టుబడుల టూర్ ను పక్కదారి పట్టించింది. బీఆర్ ఎస్ సోషల్ మీడియా బలం ముందు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బలహీనతలు బయటపడ్డాయి. గులాబీ పార్టీ శ్రేణులు చేసిన విషప్రచారాన్ని తిప్పికొట్టడంలో హస్తం పార్టీ ఆ విభాగం ముమ్మాటికి అపకీర్తినే మూటగట్టుకోవాల్సి వచ్చింది. గట్టిగా పని చేయడమే కాదు, ఆ పనిని ప్రజలకు చేరవేయడంలో కూడా సమర్థవంతంగా చేయలేదేనే అభిప్రాయం.. వ్యక్తమవుతున్నాయి. అదే విషయం రేవంత్ రెడ్డి అమెరికా టూర్ విషయంలో స్వయానా కాంగ్రెస్ పార్టీ లోనూ వినిపించడం గమనార్హం.



# తెలంగాణ మనదే..?!

- భవిష్యత్ లో అధికారంలోకి తెలుగుదేశం..?
- టీటీడీపీ ముఖ్య నాయకులతో ఏపీ సీఎం చంద్రబాబు
- ప్రతినెలా రెండో శని, ఆదివారం ఇక్కడే..
- పార్టీ నిర్మాణంపై ప్రధాన దృష్టి..
- స్థానిక సమరానికి కేడర్ కు నూతన శక్తులు..

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో రాబోయేది తెలుగుదేశం పార్టీయే. భవిష్యత్ బాగుంటుంది. అధికారం మనకే వశమవుతుంది. కష్టపడుదాం., ఫలాలు అనుభవిద్దాం..' అంటూ బాబు తెలంగాణ టీడీపీ తమ్ముళ్లకు ధైర్యం నూరిపోశారు. ఏపీలో సాధించాం., ఇక దృష్టి పెడ్తే ఇక్కడ (తెలంగాణ) కూడా వశమవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ ముఖ్య నాయకులతో బాబు కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం నారా మాట్లాడుతూ తెలంగాణలో భవిష్యత్ లో టీడీపీయే అధికారం కైవసం చేసుకుంటుందన్నారు. అందుకు అనుగుణంగా పార్టీని బలంగా మార్చుతామన్నారు. పార్టీ నిర్మాణంపైనే దృష్టిపెట్టినట్టు, త్వరలోనే గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. 15 రోజుల్లో తెలంగాణలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ షురూ చేస్తామని బాబు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న బలాన్ని మళ్లీ గాడిలో పెట్టి ముందుకు సాగుతామన్నారు. మరీ ముఖ్యంగా పార్టీలో యువత, బీసీలకు పెద్దపీట వేసి అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా తెలంగాణలో పావులు కదుపుతామని పేర్కొన్నట్టు తెలుస్తోంది. చిన్నాచితక పనులు పూర్తి చేసుకున్న తర్వాతే తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని బాబు ప్రకటించారు. ప్రతి నెల రెండో శనివారం, ఆదివారం తెలంగాణలోనే కీలకమైన భూమిక పోషిస్తానని, పార్టీ కోసం సమావేశాలు పెట్టి భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళిక రచనలు చేస్తామన్నారు.

# ఇద్దరూ.. ఒక్కటే..?!

**(మొదటిపేజీ తరువాయి)** ప్రయత్నమంటూ లేదనే టాక్ అప్పట్లో బాగా వినిపించింది. బండి గెలుపు కోసం సీఎం రేవంత్ కాగల కార్యం గంధర్వులు తీరుస్తారన్నట్టుగా ఓ అభ్యర్థిని నిలబెట్టాలి కాబట్టి నిలబెట్టి చేతులు దులుపుకున్నట్టు పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు అసెంబ్లీ ఎన్నికల ముందు ఇద్దరు ఢిల్లీలో కలిసి తెలంగాణ రాజకీయాల్లో ఉంటే నువ్వైనా కీలకం, లేదంటే నేనన్నా కీలకంగా వ్యవహరించాలనే ఒప్పందం చేసుకున్నాయనే చర్చ కూడా సాగింది.

**చిట్ చాట్‌తో క్లియర్..**

రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి ఎనిమిది నెలలైనా బండి విమర్శనాస్త్రాలు వాడలేదు. సమయం చిక్కితే చాలు కేసీఆర్ పై విరుచుకుపడేంత పని చేసే బండి సంజయ్ రేవంత్ రెడ్డి మీద మాత్రం నోరుకు పనిచెప్పింది లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అదే నిజం అన్నట్టుగా తాజాగా బండి సంజయ్ మీడియా చిట్ చాట్ లో మరింత నిజం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కేటీఆర్ ను జైల్లో వేస్తారని బండి చేసిన కామెంట్స్ ఇప్పుడు వారి బంధానికి బలం చేకూర్చుతున్నాయి. వాస్తవానికి అధికారంలో ఉన్నప్పుడు అటు రేవంత్ ను ఇటు బండి సంజయ్ ను జైల్లో వేయించారు కేసీఆర్. ఆ కసి.., ప్రతీకారం తీర్చుకునే అంశం రేవంత్ నోటి నుంచి కాకుండా బండి నుంచి బయటకు రావడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. బీజేపీ అంతర్గత వర్గాలు కూడా బండి, రేవంత్ పనితీరు ఒక్కటేనని గుసగుసలాడుతున్నాయి. ఏదిఏమైనా కేటీఆర్ ను జైల్లో పెట్టేందుకు ఆ ఇద్దరూ ఒక్కటయ్యారనే విషయం స్పష్టంగా కనిపిస్తోందని, అది ముమ్మాటికి సరికాదని తెలంగాణ భవన్ వర్గాలు ఖండిస్తున్నాయి.



## 109 రకాల వంగడాలను ఆవిష్కరించిన ప్రధాని మోడీ

**జనపదం, బ్యూరో:** వ్యవసాయ దిగుబడులను పెంచడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం కోసం వివిధ రకాల వంగడాలను ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం విడుదల చేశారు. అధిక దిగుబడి, వాతావరణ మార్పులను తట్టుకోవడం, అధిక పోషక విలువలు కలిగిన 109 రకాల వ్యవసాయ, ఉద్యానవన పంటల విత్తనాలను ప్రధాని ఆవిష్కరించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి- ఐసీఏఆర్ ఈ వంగడాలను అభివృద్ధి చేసింది. ఇందులో స్వల్పకాలిక పంటలకు సంబంధించి 61 రకాలు, 34 ఫీల్డ్ క్రాప్స్, 27 ఉద్యానవన రకాలు ఉన్నాయి. ఢిల్లీలోని పుసా ప్రాంగణంలో ప్రధాని మోడీ ఈ వంగడాలను ఆవిష్కరించారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తలతో చర్చించారు. ప్రకృతి సేద్యాన్ని పెంపొందించడం సహా, ఆర్గానిక్ ఆహారాన్ని ఎక్కువగా తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## యాదాద్రి విష్ణు పుష్కరిణిలో సంకల్ప స్నానాలు

**అవకాశాన్ని కల్పించిన అధికారులు..**

**జనపదం, యాదాద్రి:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు గుడ్ న్యూస్. పదేళ్ల తర్వాత భక్తులకు మళ్లీ.. కొండపైన ఉన్న విష్ణు పుష్కరిణిలో సంకల్ప స్నానాలు చేసే భాగ్యాన్ని కల్పించారు. శ్రావణ మాసం మొదటి ఆదివారంతో పాటు స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్ట దేవస్థానంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా.. విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పానికి శ్రీకారం చుట్టారు. అఖండ దీపారాధన జ్యోతి ప్రజ్వలన చేసి స్నాన సంకల్పాన్ని ప్రారంభించారు. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా.. కొండపైన పుష్కరిణిలో స్నానాలు చేయటాన్ని నిషేధించారు. అప్పటి నుంచి కొండ కింద ఏర్పాటు చేసిన లక్ష్మీ పుష్కరిణిలోనే భక్తులు స్నానాలు ఆచరిస్తున్నారు. కొండ కింద స్నానాలు ఆచరించి.. పైకి వెళ్లి స్వామివారి దర్శనం చేసుకోవడానికి భక్తులు ఇబ్బంది పడుతుండటంతో.. మళ్లీ విష్ణు పష్కరిణిని ప్రారంభించాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే ఆదివారం కొండపై స్నాన సంకల్పాన్ని ప్రారంభించారు. అయితే.. ఈ స్నాన సంకల్పాలు ఉచితం కాదు. ఇందుకు రూ.500 టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ టికెట్ తీసుకున్నవారికి.. కేవలం స్నాన సంకల్పమే కాదు.. స్వామివారి ప్రత్యేక దర్శన సదుపాయం, ఉచితంగా స్వామివారి లడ్డూ అందజేయనున్నారు. టికెట్ లేని భక్తులకు.. కేవలం పుష్కరిణిలో నీటిని తలపై చల్లుకునేందుకు మాత్రమే అనుమతిస్తారు.




# అంతా షాడో మంత్రుల దందా

- రెండు జాతీయ పార్టీలవి ఢిల్లీలో కుస్తీ.. బస్తీలో దోస్తీ..
- రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం
- బండి సంజయ్‌వి అవగాహన లేని వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

**జనపదం, హైదరాబాద్ ప్రతినిధి :** రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇక్కడ అంతా షాడో మంత్రుల దందా నడుస్తోందని బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కోవర్టు రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. సుంకిశాల ప్రమాదంపై బీఆర్ ఎస్ పార్టీ పలు ప్రశ్నలను ప్రభుత్వం ముందుంచిందని, ప్రాజెక్టు గోడ కూలిన ఘటనలో ఇప్పటి వరకు సమాధానం లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం కంటే సోషల్ మీడియా వేగవంతంగా పని చేస్తోందని, ప్రమాదం జరిగిన వారం రోజుల తర్వాత సోషల్ మీడియా ద్వారానే వెలుగులోకి వచ్చిందన్నారు. తాము నిర్మాణ సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రమాదంపై ఒక్కో మంత్రి ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారని, వారి మాటలకు పొంతన లేకుండా పోయిందన్నారు. ఇంత పెద్ద విపత్తు జరిగినా, నష్టం వాటిల్లినా కేంద్ర మంత్రి, బీజేపీ నేతలు ఎవరూ స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ఫైనాన్స్ శాఖలో అక్రమాలు జరుగుతున్నాయని, బిల్లుల జారీలో ఏడు శాతం ఒక చోట, ఒక శాతం మరో చోట అంటూ దోచుకుంటున్నారని అయినా ఎవరూ స్పందించడం లేదన్నారు. స్కూల్ విద్యార్థులు మరణిస్తున్నారని, లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, కుక్కలు దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని వీటిపై కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇక బండి సంజయ్ కేటీఆర్ పై మాట్లాడిన మాటలపై ప్రధానికి, కేంద్ర హోమ్ శాఖకు లేఖ రాస్తున్నామని, ఆయన వ్యాఖ్యలు రాజ్యాంగం పట్ల అవగాహన లేనట్టుగా ఉన్నాయన్నారు. ఢిల్లీలో కుస్తీ.. బస్తీలో దోస్తీ లాగా రెండు జాతీయ పార్టీల తీరు ఉందన్నారు. బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా కాకుండా రేవంత్ రెడ్డికి సహాయ మంత్రిగా పని చేస్తున్నారని అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి కేటీఆర్ ను అరెస్ట్ చేయాలని కామెంట్స్ చేయడం. ఆయన పరిధి దాటి చిల్లర మాటలు మాట్లాడిన బండి సంజయ్ పై కేంద్రాన్ని వివరణ అడుగుతామని వివేకానంద స్పష్టం చేశారు.

### విదేశాంగ శాఖ మాజీ మంత్రి
# నట్వర్ సింగ్ కన్నుమూత



**జనపదం, న్యూ ఢిల్లీ :** విదేశాంగ శాఖ మాజీ మంత్రి కే నట్వర్ సింగ్ (93) సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతూ శనివారం పొద్దుపోయిన తర్వాత మృతి చెందారు. రాజస్థాన్ లోని భరత్ పూర్ లో 1931లో జన్మించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నట్వర్ సింగ్ ను 1984లోనే కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారంతో గౌరవించింది. యూపీఏ తొలి విడత ప్రభుత్వంలో విదేశాంగ శాఖ మంత్రిగా పని చేసిన నట్వర్ సింగ్, పాకిస్థాన్ లో భారత్ రాయబారిగా, పలు దేశాల దౌత్యవేత్తగా పని చేశారు.



### యూట్యూబ్ మాజీ సీఈవో
# మరణ వార్త బాధ కలిగించింది..

- ఆమె నుంచి చాలా నేర్చుకున్నా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జనపదం, హైదరాబాద్:** యూ ట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్కికీ మరణవార్త చాలా బాధ కలిగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అత్యంత డైనమిక్‌గా ఉండే వోజ్కికీ ఎంతో తెలివైన వారని, ఆమెతో పలు సందర్భాల్లో మాట్లాడటం ద్వారా చాలా నేర్చుకున్నానని చెప్పారు. సుసాన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులకు కేటీఆర్ సంతాపం తెలిపారు.



# ఏపీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే మాధవరం

**జనపదం, ఆంధ్రప్రదేశ్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారి దర్శనాలకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

# సాగర్ కు సొగసులు..

- అందాలను తిలకించేందుకు భారీగా పర్యాటకులు
- పోలీసులు ముందస్తు చర్యలు
- నాగార్జున సాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో
- ఎనిమిది గేట్ల ఎత్తివేత



**జనపదం, బ్యూరో :** నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో తగ్గింది. శనివారం 26 గేట్లు ఎత్తగా ఆదివారం కేవలం ఎనిమిది గేట్లు మాత్రమే ఎత్తి 62,536 క్యూసెక్కుల నీరు మాత్రమే విడిచిపెడుతున్నారు. సాగర్ పూర్తి గేట్లు ఎత్తారన్న విషయం తెలుసుకున్న పర్యాటకులు డ్యామ్ అందాలను చూసేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సాగర్ పరిసరాలు రద్దీగా మారాయి. పర్యాటకులు డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను వీక్షిస్తూ సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. వరద ఉధృతి నేపథ్యంలో ఆదివారం కూడా లాంచీలను నాగార్జున కొండకు, జాలీ ట్రిప్పులను నడుపలేదు.

**ఎనిమిది గేట్లు ఎత్తివేత**

శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కి 1,02,746 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో ఎనిమిది గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 62,536 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదిలిపెడుతున్నారు. నిన్న నాగార్జున సాగర్‌కి 3,59,779 క్యూసెక్కుల నీరు చేరగా, ఇక్కడ గేట్లన్నీ ఎత్తి 3,12,756 క్యూసెక్కులు కిందకు విడిచిపెట్టిన సంగతి విదితమే. ఆదివారం కుడి కాలువ ద్వారా 1058 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, పవర్ హౌస్ కి 28,785 క్యూసెక్కులు, ఏఎంఆర్పీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్సీ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టులోకి ,02,746 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తంలో ప్రాజెక్టు నుండి అధికారులు వదిలిపెడుతున్నారు.

**నిండుకుండలా..**

నాగార్జునసాగర్ నిండుకుండలా కనిపిస్తోంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను ప్రస్తుతం 587.30 అడుగుల చేరుకుంది. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ 312 టీఎంసీలకు గాను 305.6 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ప్రస్తుతం భారీగా వరద రావడంతో అన్ని గేట్లు ఎత్తారు. ఒకవేళ ఇన్‌ఫ్లో తగ్గిపోతే ఎత్తిన గేట్ల సంఖ్య తగ్గించే అవకాశం ఉంటుంది. ఇదే ఇన్‌ఫ్లో కొనసాగుతోందన్న పరిస్థితి లేదు. వచ్చేవారం ఎలా ఉంటుందో అని ఈ వారం అధిక సంఖ్యలో పర్యాటకులు సాగర్ సుందర దృశ్యాలను తిలకించేందుకు వస్తున్నారు. కాగా, సాగర్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. ఆదివారం కావడంతో సాగర్ అందాలను చూడటానికి పర్యాటకులు పోటెత్తారు. దీంతో ప్రధాన డ్యామ్, పవర్ హౌస్ పరిసరాల్లో వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

# అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

- ఏఐ ఆధారిత డేటా సెంటర్ పై చర్చలు
- అమెరికా పర్యటనలో కంపెనీ ప్రతినిధులతో మంత్రులు
- ఫలించిని శ్రీధర్ బాబు సంప్రదింపులు



**జనపదం, హైదరాబాద్ :** అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డేటా సెంటర్ ను విస్తరించే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. ఇప్పటికే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్లో ఉంది. గత ఏడాది అమెజాన్ డెడికేటెడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్' ప్రారంభించిందని, అమెజాన్ వెబ్ సర్వీసెస్ కు సంబంధించి హైదారాబాద్ లో మూడు డేటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌తో పాటు తమ వ్యాపారాన్ని విస్త రించే ఆలోచనలను ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారంతో పాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ ముందుకు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో తమ క్లౌడ్ సదుపాయాలను మరింత విస్తరించే అవకాశాలపై ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ఉన్నత ఆలోచనలతోనే అద్భుత విజయాలు

- మోహన్ బాబు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- పద్మశ్రీ స్థాయికి ఎదగడం వెనుక గొప్ప కృషి దాగి ఉంది
- విద్యార్థులపైనే దేశ భవిష్యత్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఘనంగా మోహన్ బాబు యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవం

**జనపదం, తిరుపతి ప్రతినిధి :** ఉన్నత ఆలోచనలతోనే అద్భుతమైన విజయాలు సాధిస్తారని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చనే దానికి మోహన్ బాబు నిదర్శనమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆంధ్రప్రదేశ్ తిరుపతిలోని శ్రీ సాయినాథ్ నగర్ లో ఏర్పాటుచేసిన మోహన్ బాబు యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించి అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలు అందించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. బట్టి మాట్లాడుతూ మోహన్ బాబు యూనివర్సిటీ లో 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య, నైతిక విధానం బోధనా అంశంగా ఉండడం గొప్ప విషయమన్నారు. టీం స్పిరిట్ తో మనం ఎంతమందిని ముందుకు తీసుకుపోగలుగుతున్నామనే ఆలోచన ఉన్నతంగా ఉన్నప్పుడు అద్భుత విజయాలు సాధిస్తారని అన్నారు. ఇంతకాలం తల్లి దండ్రులు ఆర్థికంగా సపోర్ట్ చేయడంతో మీ విద్యాభ్యాసం కొనసాగిందని, ఇకనుంచి మీ జీవితంలో కొత్త అధ్యాయాలు ప్రారంభమవుతాయన్నారు. మీ మీద తల్లిదండ్రులు మా అందరి కోరిక మేరకు జాతి భవిష్యత్తుకు గొప్పగా ఉపయోగపడాలని, భవిష్యత్ లో గొప్ప విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. మీరు సాధించిన సర్టిఫికెట్లతో ఏ స్థానంలో ఉన్నా మీతో పాటు పదిమందికి ఉపయోగపడేలా మీ జీవితం ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఒక్కడిగా బతకడం గొప్ప విషయం కాదు మనం బతుకుతూ 10 మందిని బతికించడం చాలా గొప్ప విషయం అన్నారు. పోటీ ప్రపంచంలో ఎదుటివారిని ఓడించడం కష్టమైన పని కాదని, ఎదుటివారిని ఓడించి గెలవడం ఒకటే ముఖ్యం కాదని, వారి మనసు గెలవడం ముఖ్యన్నారు. ఎదుటివారి మనసు గెలవడంతోపాటు టీం స్పిరిట్ తో మనం ఎంతమందిని ముందుకు తీసుకుపోగలుగుతున్నామనే ఆలోచన అద్భుత విజయాలను సాధించి పెడుతుందన్నారు. మీతో పాటు పనిచేసే, మీ కింద పనిచేసే వారు సరైన మార్గాల్లో నడిపిస్తూ వాళ్ల గెలుపునకు ఇచ్చే సూచనలు మీ గెలుపునకు దోహదం చేయడమే కాదు వారి గెలుపులో మీ గెలుపు తోడ్పడుతుంది అని భావిస్తే గొప్ప విజయాలు సాధిస్తారని తెలిపారు.

**యూనివర్సిటీ మానస సరోవరం..**

మోహన్ బాబు యూనివర్సిటీని మొదటిసారి సందర్శించానని, ఇప్పటివరకు వినడమే కానీ చూడలేదని, అద్భుతంగా ఒక మానస సరోవరంలా ఉందని బట్టి తెలిపారు. నైతిక విధానం ఎలా ఉండాలో ప్రతి విద్యార్థికి విద్యాబోధనలో భాగంగా చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రొఫెసర్ కి, టీచర్ కి విద్యార్థికి మధ్య పర్సనల్ బ్యాండేజ్ లేకుండా పోతున్న సమయంలో ఇక్కడ అందించేది కేవలం పర్సనల్ బ్యాండేజ్ అని తెలుసుకొని సంతోషిస్తున్నానన్నారు. భారతీయ సంస్కృతిలోని గురుకులాల బాండేజ్ విధానం ఉన్న యూనివర్సిటీ మొదటి స్నాతకోత్వానికి నేను ముఖ్య అతిథిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఎన్ని విజయాలు సాధించిన గతాన్ని మర్చిపోకుండా వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకుంటూ మోహన్ బాబు ముందుకు వెళ్తున్నారని, భారత రాజ్యాంగంలోని సమానత్వం, సౌభ్రాతృత్వం అంశాలను ముందుకు తీసుకుపోయేందుకు మోహన్ బాబు ప్రయత్నిస్తున్నారని అభినందించారు. జీవితంలో అనేక రంగాల్లో నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలి అనుకునే వారికి మోహన్ బాబు జీవితం యూనివర్సిటీ లాంటిది అన్నారు. 25 శాతం మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్స్ ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని మోహన్ బాబు మొదటి నుంచి పెట్టుకుని ముందుకు తీసుకుపోవడం అభినందనీయం అన్నారు. సినీ, విద్యా రంగాల్లో ఆయన సామాజిక బాధ్యతను గొప్పగా నిర్వహిస్తున్నారని తెలిపారు. విలన్ గా, కథానాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అన్ని విభాగాల్లో సీనియర్ ఎన్టీఆర్ తర్వాత నటుడిగా అంత గొప్ప పేరు మోహన్ బాబు సాధించారని గుర్తు చేశారు. సినీ ఇండస్ట్రీలో బిజీగా ఉన్నప్పటికీ దానికి పూర్తిగా భిన్నమైన విద్యా వ్యవస్థను ఎంపిక చేసుకొని పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు అభివృద్ధి చేసి సాధించడం ద్వారా సినీ నటుడు మోహన్ బాబు మనందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పీఈటీ గా జీవితాన్ని మొదలుపెట్టి మోహన్ బాబు పద్మశ్రీ స్థాయికి ఎదగడం వెనుక గొప్ప కృషి దాగి ఉందని అన్నారు.



# పాఠశాలపై ఇజ్రాయెల్ దాడి..

**గాజాలో 80 మంది మృతి**

**జనపదం, బ్యూరో :** గాజాలో శరణార్థులు తలదాచుకున్న ఓ స్కూల్‌పైన ఇజ్రాయెల్ విచక్షణారహితంగా వైమానిక దాడులకు తెగబడింది. శనివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనలో కనీసం 80 మంది చనిపోయి ఉంటారని పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. 10 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో ఇది అత్యంత దారుణమైన ఘటనగా వారు పేర్కొన్నారు. గుర్తించలేని విధంగా మృతదేహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. అయితే సెంట్రల్ గాజాలోని తబీన్ స్కూల్‌లో హమాస్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుందని, అందుకే దాన్ని లక్ష్యంగా చేసుకున్నామని ఇజ్రాయెల్ మిలటరీ వర్గాలు తమ చర్యల్ని సమర్థించుకున్నాయి.



# శ్రీశైలంకు కొనసాగుతున్న వరద..

**ఆరు గేట్లు ఎత్తివేత**

**జనపదం, బ్యూరో :** శ్రీశైలం జలాశయానికి వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో జలాశయం 6 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి, దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో 1,11,754, ఔట్ ఫ్లో 2,30,284 క్యూసెక్కులుగా అధికారులు తెలిపారు. అలాగే పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 882.70 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 202.9673 టీఎంసీలు గా ఉంది.



# సీతారామ పంప్ హౌస్ ట్రయల్ రన్ సక్సెస్

**జనపదం, ములకలపల్లి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పుసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ నిర్వహించగా, అది విజయవంతమైందని నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు. కార్యక్రమాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి కమలాపురం పంపు హౌస్ కు మంత్రులు చేరుకున్నారు. అలాగే కమలాపురం వద్ద ఉన్న ఐదో పంపు హౌస్ ను కూడా మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందన్నా రు. గోదావరి జలాలు జిల్లాలో పారుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రీ డిజైన్ పేరుతో గత పాలకులు ఎనిమిది వేల కోట్లు వృథా చేశారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చాక జిల్లాలో అనేక నియోజకవర్గాల రైతులకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని చెప్పారు. భద్రాచలం, ఎల్లందు నియోజకవర్గ రైతులకు కూడా ఈ ప్రాజెక్ట్ నుంచి నీళ్లు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, పలువురు రాష్ట్రస్థాయి, జిల్లా ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ కట్టడాలపై రంగనాథ్ ఉక్కుపాదం

- చెరువుల ఆక్రమణపై కన్నెర్ర
- కూల్చివేతలను అడ్డుకున్న బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్ అరెస్టు

**జనపదం, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా చందానగర్ పరిధిలోని హఫీజ్ పేట్ డివిజన్ లో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు ఆదివారం కూల్చివేశారు. వైశాలినగర్ లోని ఎఫ్ టీఎల్ ల్యాండ్ లో మూడు అక్రమ నిర్మాణాలను గుర్తించిన హైడ్రా భారీ యంత్రాలతో నేలమట్టం చేస్తోంది. శనివారం ఉదయం నుంచి మొదలైన కూల్చివేతలు ఆదివారం సైతం కొనసాగాయి. అయితే కూల్చివేత సమయంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా అధికారులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా, దాదాపు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బూమ్రుఖుద్దీన్ దవాళ్ చెరువులో అధికారుల నిర్లక్ష్యంతో బఫర్ జోన్లలో దాదాపు 10 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు 20 ప్రహరీలు, 6 నిర్మాణాలను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్ కూల్చివేతలను నిలిపివేయాలని హైడ్రా సిబ్బందిని అడ్డుకోగా, పోలీసులు ఆయనను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ట్రై సిటీ పరిధిలో చెరువులకు సంబంధించిన బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో రియల్టర్లు, బిల్డర్ల నిర్మాణాలు అక్రమమని తేలితే చట్టపరంగా కూల్చివేస్తామని స్పష్టం చేశారు. అలాగే అక్రమార్కులకు సహకరించే అధికారులపై కూడా చర్యలుంటాయని హెచ్చరించారు. చెరువులు, కుంటల సమీపంలో స్థిరాస్తులను కొనుగోలు చేసే ముందు ఓ సారి హైడ్రా ఆఫీస్ను సంప్రదించడం మంచిదని సూచించారు.

# ముగిసిన విశ్వక్రీడ..

## పారిస్ ఒలింపిక్స్‌కు తెర..

ఉత్కంఠ భరితంగా గేమ్స్..

ఎన్నో గుర్తులు.. మరెన్నో ఛేదు వార్తలు..

గతాన్ని మించిన రాణించిన భారత అథ్లెట్స్..

తృటిలో చేజారిన 7 పతకాలు

ఆరు మెడల్స్‌తో.. ఇంటిదారి..

జనపదం, స్పోర్ట్స్: పారిస్ వేదికగా మొదలైన విశ్వక్రీడలు ఆదివారం రాత్రితో ముగిశాయి. సెన్ నది వేదికగా జూలై 26న అధికారికంగా ప్రారంభమైన ఒలింపిక్స్ మూడు వారాల పాటు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ ఎడిషన్ విశ్వక్రీడల్లో భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. గత టోక్యో ఒలింపిక్స్‌లో 124 మంది అథ్లెట్లు బరిలో నిలవగా.. అందులో మొత్తంగా భారత్ ఏడు పతకాలు సాధించింది. ఈసారి రెండంకెల సంఖ్యలో పతకాలే లక్ష్యంగా భారత్ పారిస్‌లో అడుగుపెట్టినా.. క్రితం సారి కంటే తక్కువ సంఖ్యలోనే (6) మెడల్స్ మాత్రమే సాధించింది. అయితే భారత సాధించిన పతకాల కంటే కూడా తృటిలో చేజార్చుకున్న వాటి సంఖ్యే ఎక్కువగా ఉంది. భారత్ అథ్లెట్స్ ఏకంగా ఏడు ఈవెంట్‌లలో నాలుగో స్థానంలో నిలిచారు. కాస్త మెరుగ్గా ప్రదర్శన చేస్తే భారత్ ఖాతలో మరో 7 పతకాలు పడేవి. అయితే భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేసి దేశప్రజల హృదయాలను గెలుచుకున్నారు.

### భారత్ తరపున లైవ్

సీన్ నదిపై జరిగే ప్రారంభ వేడుకలా కాకుండా ముగింపు వేడుక సంప్రదాయ శైలిలో నిర్వహించారు. 80,000 మంది ప్రేక్షకులతో నిండిన స్టేడ్ డి ఫ్రాన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేతలు పిఆర్ శ్రీజేష్, మను భాకర్ భారత్ తరపున పతాకధారులుగా ఉంటారు. 'వాల్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన శ్రీజేష్ హాకీలో కాంస్య పతకాన్ని సాధించి తన సుప్రసిద్ధ కెరీర్‌కు స్వస్తి పలికాడు. పారిస్ ఒలింపిక్స్ 2024 ముగింపు వేడుక ఆగస్టు 12 (సోమవారం) భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభమైంది. ఇది స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9:00 గంటలకు ముగిసింది. దాదాపు రెండు గంటల పాటు ముగింపు వేడుక కొనసాగింది.

### రానున్న ఒలింపిక్స్ ఎక్కడంటే..?

గతంలో 1900, 1924లో జరిగిన వేసవి ఒలింపిక్స్‌కు పారిస్ 2024లో మూడోసారి ఆతిథ్యం ఇచ్చింది. 2024 సమ్మర్ ఒలింపిక్స్ జూలై 26 నుంచి ఆగస్టు 11 2024 వరకు జరిగాయి. రాబోయే ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి ఐఓసీ ఐదు నగరాలను ఎంపిక చేసింది. 2026 వింటర్ ఒలింపిక్స్‌కు మిలన్ కోర్టినా డి'అంపెజ్జో, 2028 సమ్మర్ ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్, 2030 వింటర్ ఒలింపిక్స్‌కు ఫ్రెంచ్ ఆల్ప్స్, 2032 సమ్మర్ ఒలింపిక్స్‌కు బ్రిస్బేన్, 2034 వింటర్ ఒలింపిక్స్ కోసం ఆస్ట్రేలియా, సాల్ట్ లేక్ సిటీని ప్రకటించారు.

### సత్తా చాటిన షూటర్లు..

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన తొలి మూడు పతకాలు షూటింగ్‌లో వచ్చినవే. అందులో రెండు కాంస్యాలను 22 ఏళ్ల మను భాకర్ కొల్లగొట్టింది. ఓ దశలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచేలా కన్పించిన మను భాకర్.. చివరకు కాంస్యంతో సరిపెట్టుకుంది. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో స్థానంలో నిలిచి.. తృటిలో పతకాన్ని కోల్పోయింది.

### నీరజ్ రజతం.. ఫోగట్ తీర్పు వాయిదా

గత ఒలింపిక్స్‌లో పసిడి గెలిచిన నీరజ్ చోప్రా.. ఈసారి రజతానికి పరిమితమయ్యాడు. తన కెరీర్ బెస్ట్ త్రోను విసిరినా.. పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ అసాధారణ త్రో కారణంగా నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రెజ్లర్ వినేష్ ఫొగాట్ సైతం ఫైనల్ చేరి పతకం ఖాయం చేసింది. కానీ నిర్ణీత బరువు కంటే 100 గ్రాముల అదనంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడింది. దీన్ని సవాల్ చేస్తూ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ ను ఫోగట్ ఆశ్రయించింది. ఈ కోర్టు తీర్పు ఈనెల 13న వెలువడనుంది. ఒకవేళ ఆమెకు అనుకూలంగా తీర్పు వస్తే భారత్ ఖాతాలో మరో రజత పతకం చేరనుంది. అదే జరిగితే టోక్యో 2020 ఒలింపిక్స్‌లో సాధించిన ఏడు పతకాల సంఖ్యను భారత్ అందుకుంటుంది.



### పతకాలు గెలిచిన భారత అథ్లెట్లు వీరే..

1. మను భాకర్ - 10 మీ. ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం
2. మను భాకర్, సరబ్జోత్ సింగ్ - 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం
3. స్వప్నిల్ కుశాలే - 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం
4. నీరజ్ చోప్రా - జావెలిన్ త్రోలో రజతం
5. అమన్ షెరావత్ - రెజ్లింగ్‌లో కాంస్యం
6. హాకీలో కాంస్యం



## పతకాలు మిస్ అయింది వీరే..

### యువ షూటర్లు..

పారిస్ ఒలింపిక్స్‌లో అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత యువ షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్‌సింగ్ అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. స్కీట్ మిక్స్‌డ్‌టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో ఈ జోడీ.. 43–44తో నిలిచింది. కేవలం ఒక్క పాయింట్ తేడాతో కాంస్యం సాధించే ఛాన్స్ కోల్పోయింది.

### కిలో తేడాతో మిస్

టోక్యో 2020 ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన భారత మహిళా వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానుకు ఈసారి దురదృష్టం వెంటాడింది. మహిళల 49 కిలోల కేటగిరీలో పోటీకి దిగిన ఆమె.. 199 కిలోలు ఎత్తి.. నాలుగో ప్లేసులో నిలిచింది. తనకంటే ముందున్న థాయ్‌లాండ్ వెయిట్ లిఫ్టర్ ఆమె కన్నా కిలో మాత్రమే ఎక్కువగా ఎత్తింది.

### తొలి పతకం మిస్..

బొమ్మదేవర ధీరజ్, అంకిత భకత్‌కు ఆర్చరీలో పతకం కొద్దిలో మిస్ చేసుకున్నారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సెమీస్‌కు చేరిన తొలి భారత జోడీగా వీరిద్దరూ రికార్డు సృష్టించారు. కానీ కాంస్య పతక పోరులో 6–2 తేడాతో ఓడి కంచుకు అడుగు దూరంలో నిలిచిపోయారు.

### బ్రాంజ్ దూరం..

పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో భారత యువ షూటర్ అర్జున్ బబుత కూడా పతకం వచ్చినట్లే వచ్చి మిస్ అయింది. కానీ హోరాహోరీగా సాగిన పోరులో చివరకు 1.4 పాయింట్ తేడాతో కాంస్యాన్ని మిస్ చేసుకున్నాడు. దీంతో తాను పాల్గొన్న తొలి ఒలింపిక్స్‌లోనే పతకం తేవాలన్న ఆశలు ఆవిరయ్యాయి.

### షట్లర్ పతకం మిస్..

భారత యువ షట్లర్ లక్ష్యసేన్.. పారిస్ ఒలింపిక్స్‌లో సత్తాచాటాడు. ఓటమి అనేదే లేకుండా సెమీఫైనల్ వరకూ చేరాడు. అంచనాలకు మించి రాణించి.. తనకంటే మెరుగైన ర్యాంకు ఉన్న ప్లేయర్లను మట్టికరిపించాడు. కానీ సెమీస్ చేరాక వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి నాలుగో స్థానంలో నిలిచాడు.

### హ్యాట్రిక్ మిస్..

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి రెండు పతకాలు అందించిన షూటర్ మను భాకర్.. హ్యాట్రిక్ పతకాన్ని కొద్దిలో మిస్ చేసుకుంది. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భాకర్ నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ మెడల్ సాధించే సువర్ణావకాశాన్ని కోల్పోయింది.

### రితికా హుడా సంచలనం..

మహిళల 76 కిలోల రెజ్లింగ్‌లో పాల్గొన్న రితికా హుడా సంచలన ప్రదర్శనతో క్వార్టర్స్ వరకూ చేరింది. ఒలింపిక్స్‌లో తొలిసారి బరిలో నిలిచిన రెజ్లర్.. మెరుగైన ప్రదర్శన చేసింది. క్వార్టర్స్ బౌట్‌లో ప్రపంచ నెంబర్ వన్ ర్యాంకర్ కిర్గిస్థాన్‌కు చెందిన ఐపెరి మెడెట్ కైజీతో 1–1తో రితికా ఓడిపోయింది. పాయింట్లు సమానంగా ఉన్నప్పటికీ చివరి పాయింట్ సాధించిన కైజీని విజేతగా ప్రకటించారు.





## ఇంప్రెస్ చేస్తున్న ది బర్త్‌డే బాయ్

**రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్‌కనకాల** ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. విస్కి దర్శకత్వం వహించిన ఈ మూవీని బొమ్మ బొరుసా బ్యానర్‌పై నిర్మించగా.. ఐ భరత్ ఎక్స్‌క్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. జూలై 19న రిలీజైన ఈ మూవీ మిక్స్‌డ్ రెస్పాన్స్ అందుకుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు అక్కడ జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఒక బర్త్ డే పార్టీలో తన స్నేహితుడికి బర్త్ డే బంప్స్ (పుట్టినరోజు నాడు చేసే సరదా పని) ఇద్దామని ప్లాన్ చేసిన స్నేహితులు అనుకోకుండా అతడి చావుకి కారణం అవుతారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగే ఈ చిత్రం ఆగస్టు 9న ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది. యూత్‌ఫుల్ క్రేజీ డ్రామా నేపథ్యంలో సాగే ఈ మూవీ ప్రస్తుతం పాపులర్ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం ఓటీటీ లవర్స్ ఇంప్రెస్ చేస్తూ సక్సెస్‌ఫుల్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. అన్ని రకాల ఎలిమెంట్స్‌తో సాగే కథలోని ఎమోషన్స్‌కు ఓటీటీ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది.

## ఫన్‌కు నో లిమిట్..




తెలుగు రియల్టీ షో బిగ్‌బాస్ సరికొత్త సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మేరకు బిగ్‌బాస్ సీజన్ 8కు సంబంధించిన ప్రోమో ఆదివారం విడుదల చేశారు. ఈసారి కూడా అక్కినేని నాగార్జున వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. కమెడియన్ సత్య పాత్రతో ఇప్పటికే విడుదల చేసిన టీజర్ ఆసక్తికరంగా ఉంది. దాన్ని కొనసాగిస్తూ ప్రోమోను విడుదల చేశారు. 'ఈసారి బిగ్‌బాస్ సీజన్–8లో ఎంటర్‌టైన్‌మెంట్, ఫన్, టర్న్, ట్విస్ట్‌లకు లిమిటే లేదు' అంటూ నాగార్జున డైలాగ్ ఆకట్టుకుంటోంది. 'ఇన్ఫినిటీ ఆఫ్ ఫన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రెడీ కండి' అంటూ ఈ సీజన్ సరికొత్తగా అలరించనుందని నాగార్జున చెబుతున్నారు. సీజన్–8 ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో ఇంటి సభ్యులు ఎవరెవరు వెళ్లబోతున్నారనేది తెలియాలంటే.. కొద్ది రోజులు ఆగాల్సిందే.

## ప్రిన్స్.. నయా లుక్..



పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి ఎస్ఎస్ఎంబీ 29 (SSMB 29). సూపర్ స్టార్ మహేశ్ బాబు - ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా రాబోతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా కోసం మేకోవర్ మార్చేశాడని తెలిసిందే. లాంగ్ హెయిర్‌తో స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు నెట్టింట హల్ చల్ చేస్తున్న లుక్స్ చెప్పకనే చెబుతున్నాయి. తాజాగా జైపూర్ ఎయిర్‌పోర్టులో గుబురు గడ్డం, పోనీ టెయిల్‌తో కనిపించి ఔరా అనిపిస్తున్నాడు. ఎస్ఎస్ఎంబీ 29 ఎలా ఉండబోతుందో ఈ ఒక్క లుక్‌తో హింట్ ఇచ్చేస్తున్నాడంటూ అభిమానులు, మూవీ లవర్స్ తెగ చర్చించుకుంటున్నారు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా ఇంటర్నేషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని జక్కన్న టీం ప్లాన్ చేస్తుంది.




## వరుణ్ తేజ్ మట్కా లుక్ అదుర్స్

టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ నటిస్తున్న సినిమాల్లో ఒకటి మట్కా. ఈ చిత్రానికి పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా నుంచి అదిరిపోయే లుక్ షేర్ చేశారు. కమాండ్ చేసేందుకు, జయించేందుకు ఇక్కడ ఉన్నాడు.. మట్కా కింగ్ వాసును కలవండి.. అంటూ షేర్ చేసిన తాజా పోస్టర్‌లో వరుణ్ తేజ్ చేతిలో సిగరెట్ పట్టుకుని కనిపిస్తుండగా.. టేబుల్‌పై ఓ వైపు పిస్తోల్, మరోవైపు డబ్బు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రొడక్షన్ టీం 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్‌ను రీక్రియేట్ చేసిన స్పెషల్ గ్లింప్స్ వీడియో షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. వరుణ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నాడట.




## భగభగ భగ..

నాచురల్ స్టార్ నాని హీరోగా దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న చిత్రం "సరిపోదా శనివారం". ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ అంతా నెక్స్ట్ లెవెల్ రెస్పాన్స్ ని అందుకోగా ఈ చిత్రం నాని కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ కానుందనే టాక్ వచ్చింది. ఇక మేకర్స్ ఫైనల్ గా సినిమా ట్రైలర్ డేట్ ని ఊరిస్తూ వచ్చి అనౌన్స్ చేసేశారు. నాని పై ఒక ఊర మాస్ పోస్టర్ తో ట్రైలర్ రిలీజ్ డేట్ ని రివీల్ చేశారు. దానిపై భగభగ భగమని అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఇందులో నాని మంచి అగ్రెషన్ మోడ్ లో కనిపిస్తుండగా ఈ సీక్వెన్స్ ఒక యాక్షన్ సీన్ లోది అన్నట్టుగా కనిపిస్తుంది. ఇలా ఈ సినిమా ట్రైలర్ కట్ ని ఈ ఆగస్టు 13న విడుదల చేస్తున్నట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. దీనితో ఇప్పుడు ట్రైలర్ పై మంచి అంచనాలు నెలకొన్నాయి. చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటించగా ఎస్ జే సూర్య విలన్ గా నటించారు. ఆగస్టు 29న సినిమా గ్రాండ్ గా పాన్ ఇండియా భాషల్లో రిలీజ్ కాబోతుంది.